శాంతి భద్రతలో మొదటి స్థానం మనదే..




సురక్ష దినోత్సవాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, పోలీస్ అధికారులు

కూకట్‌పల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సురక్ష దినోత్సవాన్ని బాలానగర్ జోన్ పోలీసులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లు విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలు ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పదేళ్లలో మనం సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియపరిచేందుకు దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. శాంతి భద్రతల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగరంలో ప్రజలు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతమైన జీవనం గడుపుతున్నారని అన్నారు. ఎవరికైనా ఆపద ఉంది అని తెలియగానే పోలీసులు వెంటనే చర్యలు తీసుకొని తగిన పరిష్కారం చూపిస్తున్నారని తెలిపారు. అదే విధంగా నిఘా కోసం అన్ని ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేయించి అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎక్కడా ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూస్తున్నారని అందుకు వారిని అభినందిస్తున్నానని తెలిపారు.

అలరించిన అస్త్ర విన్యాసం

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పోలీసు సురక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లోని ఏఎంబీ మాల్ మెయిన్ ఆట్రియంలో స్పెషల్ పోలీస్ టీమ్‌తో సైలెంట్ ఆర్మ్స్ డ్రిల్ నిర్వహించారు. 50 మంది సిబ్బంది నిర్వహించిన ఈ డ్రిల్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. స్పెషల్ పోలీస్ బృందం విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ వెంకట్‌రెడ్డి, స్పెషల్ టీమ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సిద్ధార్థ్‌నాయక్ పాల్గొన్నారు.

నడి రోడ్డుపై మృత్యుకుహరాలు

- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న మ్యాన్‌హోళ్లు
- మూతల ఏర్పాటుపై నిర్లక్ష్యం
- ముందుకు సాగని పూడిక తీత పనులు
- పొంచి ఉన్న ముంపు ప్రమాదం



ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లోని మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో వైర్లను ఏర్పాటు చేసిన దృశ్యం





ఈనాడు కాలనీలో కుంగిపోయిన మ్యాన్‌హోల్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. వాటిపై మూతల ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయాలి. కుంగిపోయిన వాటిని గుర్తించి మరమ్మతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అయితే వర్షాకాలం సమీపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గత వర్షా కాలంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయాల పాలయ్యారు. వాహనదారులు సైతం మ్యాన్‌హోల్స్‌లో దిగబడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు బస్తీలు, కాలనీల్లో పర్యటించి ఆయా సంక్షేమ సంఘాల సభ్యులతో చర్చించి ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్, సిక్కుల బస్తీ, పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్‌కాలనీ, వెంకటేశ్వరనగర్, మాధవరం కాలనీ, వివేకానందనగర్ కాలనీ, ఈనాడు కాలనీ, ఆదిత్యానగర్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌పై మూతలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టడమేగాక పై కప్పులు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ముందుకు సాగని పూడికతీత పనులు

ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, సిక్కుల కాలనీ, తులసీ నగర్, శ్రీ తులసినగర్, పాపిరెడ్డి నగర్, మాధవరం కాలనీ, తదితర ఓపెన్‌నాలాల్లో చెత్తా చెదారం పేరుకుపోయి వరదనీరు పోకుండా రోడ్డుకు సమాంతరంగా నిలిచిపోయింది. అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిస్తే వరదనీరు నాలాలో ప్రవహించకుండా రోడ్లపైనే పారుతూ ఇళ్లను ముంచెత్తుతోంది. ఆస్తి నష్టం సంభవిస్తుంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కాలనీల్లోని ఓపెన్ నాలాలపై ఉన్న శ్లాబు పై కప్పులను తొలగించి పూడిక తీత పనులు చేపట్టాలని ఆయా కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, కాలనీ వాసులు కోరుతున్నారు.

కేసీఆర్ పాలనలో సామాజిక, ఆర్థిక లక్ష్యాలు నేరవేరలేదు

- కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: తెలంగాణ రాష్ట్రం భౌగోళికంగా ఏర్పాటు అయ్యిందే తప్ప ప్రజలు కోరుకున్న సామాజిక, ఆర్థిక లక్ష్యాలు కేసీఆర్ పాలనలో నేరవేరలేదని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు విమర్శించారు. మరోసారి కేంద్రంలో నరేంద్రమోడీ సర్కర్‌తో పాటు తెలంగాణలో బిజెపి సర్కార్ నినాదంతో బిజెపి భరోసా యాత్ర సాగిస్తుందని అన్నారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో చెపట్టిన బీజేపీ భరోసా పాదయాత్ర 4వ రోజుకు చేరుకుంది. అంబేడ్కర్ చౌరస్తా నుంచి మందుల బస్తీ, లైన్స్‌టౌన్ కాలనీలలో పర్యటించారు. జీతాలకు డబ్బులు లేని ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ రాష్ట్ర అవిర్భావ దినోత్సవాలకు రూ. 150 కోట్లు ఖర్చు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వడ్డేపల్లి నర్సింగ్‌రావు, నాయకులు సూర్యరావు, శ్రీకర్‌రావు, సంతోష్, తిరుపతి, కన్నె ప్రకాశ్, వినోద్, డాకయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.29, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 65, గోకర కాయ 45, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 13, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 17, కందగడ్డ 28, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, ముల్లంగి 4-6.

అన్నదానం



బొమ్మారెడ్డి వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొమ్మారెడ్డి వెంకటరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావులు విచ్చేసి అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చలివేంద్రం ముగింపు సందర్భంగా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. రోజు రోజుకూ ఎండలు విపరీతంగా పెరిగి పోవటంతో ఇక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చినందుకు నిర్వాహకులను అభినందిస్తున్నానని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హెచ్‌ఎంటీ శాతవాహననగర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



భాగ్యనగర్‌కాలనీ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదురుగా ఓ వ్యక్తి పడిపోయి ఉండటానికి స్థానికులు గమనించి 100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

నేడు ఓయూలో మార్నింగ్ వాక్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ పర్యావరణం దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు (5న) ఓయూలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి ఎన్‌సీసీ గేటు వరకు జరిగే వాకింగ్‌లో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు భాగస్వాములు కావాలని అధికారులు పేర్కొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కాలేజీ వద్ద సమావేశం ఉంటుందన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



బాలానగర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజు కాలనీలో జరిగింది. చొప్పదండి పవన్ వెంకటరాజు, భార్య చొప్పదండి విజయలక్ష్మి(38) గృహిణి రాజు కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం మానశ్రీ (13), విరాట్ తేజ్ హనుమాన్(11)లు ఉన్నారు. స్థానిక మహిళలతో శ్రీ విద్యా పొదుపు సంఘం స్థాపించింది. సంఘానికి సంబంధించి నగదు తిరిగి బ్యాంక్‌లో జమ చేయలేని క్రమంలో మానసిక ఒత్తిడికి లోనై సమయానికి డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో ఆందోనకు గురైన విజయలక్ష్మి శనివారం సాయంత్రం తన ఇంటిపై గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొని, చున్ని సాయంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నది. అయితే ఆ తరువాత ఆమె కూతురు గది కిటికీలోకి చూడగా అప్పటికే ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

భాగ్యనగర్‌కాలనీ: ఊరు వెళ్లొచ్చేసరికి ఇంట్లో బంగారం కనిపించకపోవడంతో బాధితులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మేడిపల్లి శ్రీకాంత్, పాపారాయుడునగర్‌లో నాయిన్స్ నేచర్ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఎస్ఆర్‌నగర్ వెంగళరావు నగర్‌లో డెంటల్ హాస్పిటల్ నిర్వహిస్తున్నాడు. గత నెల 13న కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామం వెళ్లాడు. శ్రీకాంత్ 14న ఇంటికి చేరుకున్నాడు. రోజు మాదిరిగానే ఆసుపత్రికి వెళ్తూ ఇంటికి వస్తున్నాడు. అయితే గత నెల 31వ తేదీన శ్రీకాంత్ భార్య సింధు ఊరు నుంచి ఇంటికి వచ్చింది.

- తన కుమారుడి చైన్ దాచి పెట్టేందుకు బంగారం బాక్స్ తీసి చూసేసరికి అందులో ఉన్న సుమారు 70 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే తన భర్తకు విషయాన్ని చెప్పి పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీస్‌లు డాగ్ స్క్వాడ్, వేలిముద్ర నిపుణులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.దొంగతనం జరిగిన తీరును పరిశీలించిన కూకట్‌పల్లి పోలీసులు తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.